అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: భాజపా అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత మేధావుల రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రామాయణ, భగవద్గీతలకు సమానమైన రాజ్యాంగం అందించిన అంబేడ్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శమన్నారు. పార్లమెంటుపై దాడిచేసిన వ్యక్తికి వత్తాసు పలుకుతూ రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను అపహాస్యం చేస్తున్న విద్రోహ శక్తులను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివప్రసాద్, కార్పొరేటర్లు సాయివర్ధన్, రాఘవేందర్, నాయకులు సందీప్, సాయినాథ్, కిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీసీలంతా ఏకతాటిపై ఉద్యమించాలి

బాల్కొండ, న్యూస్‌టుడే: బీసీలు పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బాల్కొండలో ఆదివారం బీసీ మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్, కనీసం 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. స్థానిక ఎన్నికలకు ముందే కులగణన చేపట్టాలన్నారు. రాజకీయంగా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎదగాలని, న్యాయమైన వాటా కోసం ఐక్యంగా ఉద్యమించాలని చెప్పారు. నాయకులు రామాగౌడ్, అశోక్‌గౌడ్, యాదాగౌడ్, రాంపూర్ రామాగౌడ్, దాసరి మూర్తి, వెంకన్న, అన్నగౌడ్ నారాగౌడ్, శ్యామ్, సుభాష్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్

14వ తేదీలోపు విధుల్లో చేరాలి

విద్యుత్తు శాఖలో బదిలీల కసరత్తు

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

విద్యుత్తు శాఖ ఉద్యోగుల బదిలీలకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మార్గదర్శకాలు విడుదలయ్యాయి. డీఈ, ఏఈ, సబ్ ఇంజినీర్, ఎస్ఏవో, జేఏవో, ఏవో, ఏఏవో, పీవో క్యాడర్ ఉద్యోగులు వెబ్‌ఆప్షన్ ఇచ్చారు. దిగువ స్థాయి సిబ్బందికి డీఈ కార్యాలయాల్లో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టనున్నారు. ఈ జాబితా సిద్ధం చేశారు. ఈ ప్రక్రియ ఈ నెల 7వ తేదీ నాటికి పూర్తి చేయనున్నారు. బదిలీ అయిన వారంతా 9వ తేదీన విధుల్లో చేరాలని ఆదేశాలు ఇచ్చారు. దసరా పండగ నేపథ్యంలో ఈ నెల 14 లోపు చేరాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కోరుకున్న స్థానం కోసం సిబ్బంది ఎవరికి వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రధానంగా యూనియన్ నేతలు కొందరు పవర్ హౌస్ పరిపాలన విభాగంలోకి వచ్చేందుకు చూస్తున్నారు. నిబంధనల ప్రకారం యూనియన్‌లో కీలక పాత్రలో పోషించే వారు క్షేత్ర స్థాయిలోనే విధులు నిర్వహించాలి. కానీ, ఇందుకు విరుద్ధంగా పరిపాలన విభాగంలోకి వచ్చేందుకు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. బదిలీలు పారదర్శకంగా చేపడతామని ఎస్ఈ రవీందర్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

శ్రీరామసాగర్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 21,590 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు వరద గేట్లను ఆదివారం మూసివేశారు. ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో 1091 అడుగుల వరకు నీటి మట్టం ఉంది. కాకతీయ కాల్వ ద్వారా 6800, ఎస్కేప్ గేట్ల నుంచి 1200, లక్ష్మి కాల్వకు 150, సరస్వతి కాల్వ ద్వారా 500, వరద కాల్వ ద్వారా 12000, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

అత్యాశకుపోయి.. అప్పులపాలై..



- ఆన్‌లైన్ ఆటల్లో మోసపోతున్నది విద్యావంతులే
- తీర్చే మార్గంలేక ఆత్మహత్యలు

న్యూస్‌టుడే, ఇందూరు సిటీ

ప్రస్తుత పరిస్థితుల్లో మద్యపానం.. ధూమపానం కంటే చరవాణే చెడు వ్యసనమైంది. అవసరానికి వాడుకుంటే ప్రయోజనం. కానీ, కొందరు అతిగా ఆన్‌లైన్ ఆటలకు బానిసై రూ.కోట్లలో అప్పులు చేసి తీర్చే మార్గం లేక తనువు చాలిస్తున్నారు. యువతతో పాటు ప్రభుత్వ ఉద్యోగులూ ఇందులో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశే ఇందుకు ప్రధాన కారణం. జిల్లాలో ఇప్పటి వరకు 57 రిజిస్టర్డ్ సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. ఆన్‌లైన్ షాపింగ్, ఫ్రాంఛైజీల అమ్మకాలు, అశ్లీల వీడియోలతో ఎర, బహుమతుల పేరిట మోసపోతున్న ఘటనలు ఎక్కువగా ఉంటున్నాయి. స్థాయికి మించి అప్పులు చేసి అవమాన భారం తట్టుకోలేక బలవన్మరణం పొందుతున్నారు. రెండేళ్లలో ఐదుగురు ఆన్‌లైన్ గేమింగ్స్‌కు బలికావడం గమనార్హం. బయటకు చెప్పుకోవడానికి ఇష్టపడని వారు అనేకం ఉన్నారు.

మచ్చుకు కొన్ని..

- ఎడపల్లి మండలంలో కిరాణా కొట్టు నడుపుకొనే దంపతుల కుమారుడు ఆన్‌లైన్ గేమింగ్స్‌కు అలవాటుపడి రూ.లక్షల్లో అప్పు చేశాడు. పరువు కోసం పొలం అమ్మి కట్టేశారు. తీరు మారని ఆ యువకుడు మళ్లీ రూ.18 లక్షలు బాకీ చేశాడు. తీర్చే మార్గం లేక కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది.
- మాక్లూర్ మండలానికి చెందిన భార్యాభర్తలు ప్రభుత్వ ఉపాధ్యాయులే. భర్త ఆన్‌లైన్ ఆటకు బానిసై రూ.2 కోట్లకు పైగానే పోగొట్టుకున్నాడు. అప్పులు తీవ్రం కావడం, కట్టలేని స్థితికి చేరి అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్నాడు.
- జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు కష్టపడి సర్కారు కొలువు కొట్టాడు. సొంతింటి కల సాకారం చేసుకున్నాడు. పెళ్లి చేసుకొని ఇద్దరి పిల్లలతో జీవితం సాఫీగా సాగుతోంది. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసయ్యాడు. దొరికిన చోటల్లా అప్పుచేసి బయటపడే మార్గం లేక పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు.
- పక్క జిల్లాలో ఓ ప్రముఖ విద్యాసంస్థలో మంచి వేతనానికి ఓ యువకుడు అధ్యాపకుడిగా చేరారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కాసేందుకు బంధువులు, స్నేహితులు వద్ద రూ.3 కోట్ల వరకు అప్పులు చేసి ఎవరికీ కనిపించకుండా తిరుగుతున్నాడు.
- నందిపేట్ మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుటుంబం ఆర్థికంగా మంచి స్థితిలో ఉంది. ఆ ఇంట్లో ముగ్గురికి ప్రభుత్వ కొలువులు. యువకుడు మాత్రం ఆన్‌లైన్ యాప్స్‌లో ఆటలు ఆడి రూ.90 లక్షలు స్వాహా చేశాడు. తీరా తండ్రికి విషయం తెలిసి బాకీలు చెల్లించాడు.



అది మానసిక రుగ్మత

- విశాల్, మానసికవైద్య నిపుణుడు

ఆన్‌లైన్ గేమింగ్ ఓ మానసిక రుగ్మత. గంటల కొద్ది చరవాణిలో మునిగి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసవుతున్నారు. వీరిని కుటుంబ సభ్యులు ఓ కంట కనిపెట్టాలి. తీవ్రత మేరకు మానసిక వైద్యుడిని సంప్రదించాలి.

చిల్లర కాజేత



న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

వృద్ధులు, వితంతువులకు ఇచ్చే పింఛను డబ్బులు కాజేస్తున్నారు. పైన ఇవ్వాల్సిన చిల్లరను జేబులో వేసుకుంటున్నారు. పింఛనర్ల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని చేతివాటం చూపుతున్నారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిసినా అది 'చిల్లరే' కదా! అని వదిలేస్తున్నారు.

- ప్రతి పింఛనులో రూ. 16 కోత
- ఒక్కోచోట కనీసం రూ.4 వేలు జేబులోకి..

జిల్లా వ్యాప్తంగా 2,72,873 మంది వివిధ పింఛన్లు పొందుతుండగా రూ.54 కోట్లు చెల్లిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీసు సిబ్బంది పంపిణీ చేస్తారు. ప్రతినెలా మొదటి వారం రాగానే తపాలా కార్యాలయాల వద్ద పింఛనర్లు పడిగాపులు కాస్తారు. ప్రభుత్వం దివ్యాంగులకు రూ.4,016, ఇతర పింఛనర్లకు రూ.2,016 చొప్పున ఇస్తోంది. అయితే సిబ్బంది రూ.4 వేలు, రూ.2 వేలు మాత్రమే ఇస్తూ.. పైన రూ.16 చిల్లర లేదనే సాకుతో జేబులో వేసుకుంటున్నారు. గట్టిగా ఎవరైనా అడిగితే ఇస్తున్నారు. చాలా గ్రామాల్లో సగటున 500 మంది పింఛనర్లు ఉన్నారు. కొన్ని చోట్ల 250 మందికి చిల్లర ఎగ్గొడుతున్నారు. కనీసం రూ.4 వేలు కాజేస్తున్నారు. పెద్ద గ్రామాల్లో అంతకంటే ఎక్కువే ఉంటోంది. డీఆర్‌డీఏ, తపాలా శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



ధర్పల్లి తపాలా కార్యాలయం ఎదుట పడిగాపులు కాస్తున్న పింఛనర్లు

బ్యాంకు ఖాతా లేక...

నిజామాబాద్ నగరంతో పాటు బల్దియాల్లో డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో పడతాయి. ఇక్కడ ఏ సమస్య లేదు. గ్రామాల్లో పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేస్తుండటంతో సమస్య ఎదురవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ నేరుగా ఖాతాల్లోనే వేసేందుకు రెండేళ్ల క్రితం ఖాతాలు తీయించారు. ఈ వివరాలు డీఆర్‌డీఏ సిబ్బంది సేకరించారు. కానీ, ఇది అమల్లోకి రాలేదు. చిల్లర కాజేత విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డీపీఎం(పింఛన్) రాచయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఇది వరకు ఫిర్యాదులొస్తే పరిష్కరించామని, ఈ సారి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య తలెత్తకుండా చూస్తానని వెల్లడించారు.

పింఛన్ రకం	లబ్ధిదారులు
బీడీ కార్మికులు	95,516
వితంతు	74,498
వృద్ధాప్య	69,309
దివ్యాంగ	18,969
ఒంటరి మహిళలు	10,221
ఎయిడ్స్ బాధితులు	1,550
గీత కార్మిక	1,038
బీడీ టేకేదార్లు	1,025
బోదకాలు	381
డయాలసిస్ రోగులు	184
చేనేత	184

చెరువును బట్టి చేప

నేటి నుంచి పంపిణీ ● అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హితవు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

2024–25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. వాటి నాణ్యత చూసుకోవాల్సిన బాధ్యత మత్స్య పారిశ్రామిక సంఘాలపైనే ఉందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఏయే రకాలు ఇస్తున్నారు? నిర్దేశిత సైజు, అవి చలాకీగా ఉన్నాయో? లేదో పరిశీలించుకోవాలని చెప్పారు. ఏ మాత్రం తేడాలున్నా మత్స్యశాఖ అధికారులు, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయొచ్చని వెల్లడించారు.

నిర్దేశిత ప్రమాణాల మేరకు.

జిల్లాలో 396 మత్స్యపారిశ్రామిక సంఘాలకు చెందిన 24 వేల మంది లబ్ధిదారులకు మత్స్య అభివృద్ధి పథకం కింద ఉచితంగా చేప పిల్లలు ఇస్తున్నారు. ఈ ఏడాది లక్ష్యాన్ని సగానికి కుదించినప్పటికీ నిర్దేశిత ప్రమాణాల మేరకు ఇవ్వాలని నిర్ణయించారు. 6-8 నెలల పాటు నీరు నిల్వ ఉండే చెరువుల్లో 35 ఎంఎం - 40 ఎంఎం సైజువి ఇస్తారు. 35 శాతం కట్ల, మరో 35 శాతం రోహు, మిగిలిన 30 శాతం బంగారు తీగ పిల్లలను ఇవ్వాలని ఆదేశించారు. నీరు శాశ్వతంగా ఉండే చెరువులు, రిజర్వాయర్లలో 80 - 100 ఎంఎం సైజువి వదలనున్నారు. 40 శాతం బొచ్చ, 50 శాతం రోహు, మిగిలిన 10 శాతం మృగాల ఇచ్చేలా మార్గదర్శకాలిచ్చారు. పెద్ద సైజు పిల్లలు కిలోకు 250-300 ఉండేలా తూకం వేయాలని సూచించారు.

మత్స్యపారిశ్రామిక సంఘాలు: 396
లబ్ధిదారులు: 24 వేల మంది
చెరువులు: 967
35-40 ఎంఎం సైజువి : 1.35 కోట్లు (814 చెరువులు)
80-100 ఎంఎం సైజువి: 91 లక్షలు (153 చెరువులు)

పర్యవేక్షణ తప్పనిసరి

ఏడాది పొడవునా నీరుంటే శాశ్వత చెరువుల్లో పిల్లలు వదిలేప్పుడు తప్పనిసరిగా జిల్లా మత్స్యశాఖ అధికారి, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు పది మంది విధిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీజనల్ చెరువుల్లో వదిలేప్పుడు జిల్లా మత్స్యశాఖ అధికారి/ మత్స్య అభివృద్ధి అధికారి/ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, ఏఈవో, జిల్లా, గ్రామ మత్స్య సంఘం సభ్యులు ఉండాలన్నారు.



దసరా తర్వాతే వడ్ల కొనుగోళ్లు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. అదనపు పాలనాధికారి కిరణ్‌కుమార్ పౌర సరఫరాలు, వ్యవసాయం, మార్కెటింగ్, రవాణా ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 11.94 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా ఉండగా.. 8 లక్షల మె.ట. సేకరించాలని లక్ష్యం నిర్ణయించారు. దసరా తర్వాత కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఐకేపీ, మెప్మా, సహకార సంఘాలు అన్ని కలిపి 480 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రాథమిక ఆలోచనలో ఉన్నారు.

480 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు



ఎడపల్లిలో ధాన్యం నింపుతున్న కూలీలు

జిల్లా వివరాలు	వరి సాగు విస్తీర్ణం 4.10 లక్షల ఎకరాలు
కొనుగోలు లక్ష్యం 8 లక్షల మె.ట	దిగుబడి అంచనా 11.94 లక్షల మె.ట
మద్దతు ధర ఏ-గ్రేడ్ రకానికి : క్వింటాకు రూ. 2,320	సాధారణ రకానికి రూ. 2,300

బోధన్ డివిజన్‌లో ప్రైవేటులో షురూ..

బోధన్ డివిజన్‌లో రెంజల్, బోధన్, ఎడపల్లి, వర్ని, కోటగిరి మండలాల్లో ప్రైవేటుగా కొనుగోళ్లు మొదలయ్యాయి. మన రాష్ట్రం మిర్యాలగూడ, సూర్యాపేటతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి వ్యాపారులు కల్లాల వద్దే వచ్చి పచ్చి ధాన్యం కొంటున్నారు. క్వింటాకు రూ.2,250 నుంచి రూ.2,300 చెల్లిస్తున్నారు. ఇక్కడ నూర్పిడి త్వరగానే ప్రారంభం కావడం, అధికారులు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో మిల్లర్లకు మేలవుతోంది. ధాన్యం రోడ్డు మీద ఆరబెట్టి ఇబ్బందులు పడే కంటే అమ్మితేనే మేలని రైతులు భావిస్తున్నారు.

ఇబ్బందులు అధిగమించేలా..

ధాన్యం సేకరణలో అన్నదాతలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన గన్నీ సంచులు, లారీలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. గత సీజన్‌లో తరుగు పేరిట కోతలు విధించారనే ఆరోపణలు రావడంతో ఈ సారి పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు.

హమాలీల కొరత రానీయం

ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. దసరా తర్వాత ప్రారంభించే అవకాశం ఉంది. గన్నీ సంచులు, హమాలీల కొరత, రవాణా ఇబ్బందులు రానీయం. **- రమేశ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్**

'మోదీ, అమిత్‌షాలతోనే దేశానికి ప్రమాదం'

ఖలీల్‌వాడి(నిజామాబాద్), న్యూస్‌టుడే: ముస్లింలతోనే ప్రమాదం పొంచి ఉందని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ పేర్కొనడం సరికాదని.. ప్రధాని మోదీ, హోం శాఖ అమిత్‌షాతోనే ప్రమాదమని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత భాజపా పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. 400 లోక్‌సభ సీట్లు గెలుస్తామని చెప్పిన మోదీ వాటిని సాధించలేదన్నారు. హిందూ సంఘాలు సంఘటితంగా భాజపా గెలుపునకు కృషి చేసినా తక్కువ సీట్లే వచ్చాయని, దేశంలో మైనార్టీలు ఐకమత్యంగా ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమన్నారు. మన భూభాగాన్ని చైనా ఆక్రమిస్తున్నా కేంద్రం మౌనంగా ఉండటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ ఎంపికను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, భైంసా మున్సిపల్ ఛైర్మన్ జుబేర్ పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

రోడ్డు కోత.. ప్రయాణికుల వెత



డిచ్‌పల్లి మండలం ముల్లంగి నుంచి మోపాల్ మండలం కంజర వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. ఇక్కడ మూలమలుపు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, డిచ్‌పల్లి**

ఆమాత్రం లేవా..! ..14లో

మద్యం మత్తులో తనయుడి విక్రయం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాలని, ఓ తండ్రి మద్యం మత్తులో కన్న కుమారుడినే విక్రయించిన ఘటన ఆర్మూర్‌లో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. నందిపేట్ మండలం సిద్ధాపూర్‌కు చెందిన లక్ష్మి, పోశెట్టి దంపతులు ఏడాదిగా కొటార్మూర్‌లో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి తనయుడి(7 నెలలు)ని పెర్కిట్‌కు చెందిన మహ్మద్‌గౌస్ ద్వారా ఆర్మూర్ శాస్త్రీనగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్‌కు ఇటీవల రూ.30 వేలకు విక్రయించారు. హబీబ్ ఖాన్ కుమార్తె రషీదకు సంతానం లేదు. నిర్మల్‌లో నివసిస్తున్న కూతురు, అల్లుడు మహ్మద్‌కు బాలుడిని ఇచ్చాడు. వారం గడిచాక పోశెట్టి డయల్ 100కు ఫోన్ చేసి తన బాబును ఇప్పించాలని కోరాడు. ఆర్మూర్, నందిపేట్ పోలీసులు విచారణ చేపట్టగా ఈ ఉదంతం బయటపడింది. ఇందులో భాగమైన అయిదుగురిపై(పోశెట్టి, మహ్మద్‌గౌస్, హబీబ్‌ఖాన్, రషీద, మహ్మద్) పోలీసులు కేసు నమోదు చేశారు. పిల్లాడిని ఐసీడీఎస్ అధికారుల సంరక్షణకు తరలించారు.

సమీప కేంద్రాలే దిక్కు

● దుబ్బ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
◆ 120
■ నొప్పుల మందులు, యాంటీబయోటిక్స్, దగ్గు మందుల కొరత ఉంది.
☛ మందులు సరిపడా లేకపోవడంతో వేరే యూపీహెచ్‌సీల నుంచి తెప్పించుకుంటున్నారు.
➾ సీజనల్ వ్యాధులతో ఓపీ పెరిగింది. పక్కనున్న యూపీహెచ్‌సీల నుంచి మందులు తెప్పించి తమకు రాగానే ఇచ్చేస్తున్నామని వైద్యాధికారిణి శ్రీలత చెప్పారు.



\- న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్య విభాగం

సమయపాలన కరవు

● నందిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
◆ 100
■ ఒళ్లు నొప్పులు, దగ్గు మందులు లేవు.
☛ సిబ్బంది ఆలస్యంగా వస్తున్నారని రోగులు చెబుతున్నారు.
➾ మందుల కొరత లేకుండా చూస్తామని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ భాస్కర్ తెలిపారు.

\- న్యూస్‌టుడే, నందిపేట్



నందిపేట్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సిబ్బందిని పెంచాలి

● భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
◆ 130 ■ మందులు ఉన్నాయి. ☛ భిక్కనూరు పీహెచ్‌సీ పరిధిలో ఏడు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాలి. ఒక్క పెద్దమల్లారెడ్డి ఉప కేంద్రంలో తప్ప మిగతా అన్నింటా ఒక్కొక్కరే విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున భిక్కనూరు పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు.



\- న్యూస్‌టుడే, భిక్కనూరు

ఆ మాత్రం లేవా..!

● పీహెచ్‌సీల్లో మందుల కొరతతో రోగుల ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరం తగ్గినా నొప్పులు రోగులను వదలడం లేదు. ఉమ్మడిజిల్లాలోని సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌లో మందుల నిల్వలు నిండుకున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అరకొరగానే సరఫరా చేస్తుండడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. శని, ఆదివారాల్లో 'న్యూస్‌టుడే' పీహెచ్‌సీలను పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పరిశీలన

● పీహెచ్‌సీ పేరు
◆ నిత్యం వచ్చే రోగుల సంఖ్య
■ సరిపడా మందులు ఉన్నాయా? లేవా?
☛ గుర్తించిన అంశాలు
➾ అధికారి వివరణ

పిల్లల ఔషధాల కొరత

○ నవీపేట ◆ 150 నుంచి 200
■ చిన్న పిల్లలకు సంబంధించిన యాంటీబయోటిక్ మందులు, ఇతర లేపనాల కొరత ఉంది.
☛ వైద్యుల్లో ఒకరు విధులు నిర్వహిస్తుండగా మరొకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ➾ వైద్యాధికారిణి కావ్య మాట్లాడుతూ.. బఫర్‌స్టాక్ నుంచి 20శాతం మందులు తీసుకోవడంతో ఔషధాల కొరత లేదన్నారు.

\- న్యూస్‌టుడే, నవీపేట



చిన్నారుల టీకాలు లేవు

● భీమ్‌గల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం
◆ 150 ■ చిన్నారులకు అవసరమైన పలు రకాల వ్యాక్సిన్ల కొరత ఉంది.
☛ రెగ్యులర్ వైద్యుడు లేడు. ఇక్కడ పనిచేసే అజయ్‌పవార్ కిసాన్‌నగర్ బదిలీ అయి.. డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు.
➾ వారం రోజుల్లో వ్యాక్సిన్లు వచ్చే అవకాశముందని వైద్యాధికారి అజయ్‌పవార్ తెలిపారు. - న్యూస్‌టుడే, భీమ్‌గల్

ప్రాథమిక వైద్యం చేస్తూ.. పంపించేస్తూ

● మోర్తాడ్ సీహెచ్‌సీ ◆ 95
■ మందులున్నాయి ☛ ఆసుపత్రిలో కేవలం ఇద్దరే వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. కుక్క, పాము కాట్లకు ప్రాథమిక చికిత్స చేసి ఆర్మూర్, మెట్‌పల్లి, నిజామాబాద్ ఆసుపత్రులకు పంపిస్తున్నారు.
➾ అన్ని మందులున్నాయి. కుక్క, పాము కాట్లకు ప్రాథమిక చికిత్స చేసి ఆర్మూర్, నిజామాబాద్ ఆసుపత్రులకు పంపిస్తున్నామని అధికారులు తెలిపారు.

\- న్యూస్‌టుడే, మోర్తాడ్

స్టాఫ్‌నర్సులే ల్యాబ్‌టెక్నీషియన్లు

● పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
◆ 100 ■ మందులున్నాయి.
☛ వైద్యుల కొరత ఉంది. రక్త, ఇతర పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో స్టాఫ్‌నర్సులే ఆ పని చేస్తున్నారు. ➾ ల్యాబ్ టెక్నీషియన్ కావాలని విన్నవించామని వైద్యుడు అనిల్ తెలిపారు.

\- న్యూస్‌టుడే, బాల్కొండ

ఒళ్లు నొప్పులొస్తే తిప్పలే

● ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 120
■ కంటి చుక్కల మందు, టీటీ ఇంజెక్షన్లు, దగ్గు, ఎలర్జీ, నొప్పులకు సంబంధించిన ఔషధాలు లేవు. ☛ భవనం చిన్నగా ఉండటంతో సామగ్రి పెట్టడానికే సరిపోతుంది.
➾ త్వరలోనే ఔషధాల కొరత సమస్యను పరిష్కరిస్తామని మండల వైద్యాధికారి సంతోష్‌కుమార్ వివరించారు. - ఇందల్‌వాయి

అరకొరగా ఇస్తూ..

● ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
◆ 80 ■ జ్వరం, దగ్గు, తల, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు, చర్మ సంబంధ వ్యాధుల మాత్రలు, బాలింతలు, గర్భిణులకు కావాల్సిన ఐరన్ ఇంజెక్షన్లు అరకొరగా ఉన్నాయి. ☛ ఇండెంట్ పెట్టినంత మందులు ఇవ్వకపోవడంతో అరకొరగా ఇస్తున్నారు.
➾ రోగికి అవసరమైన మందులు రాసి ఇస్తున్నాం. ఫార్మసిస్టు అరకొరగా ఇస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని వైద్యులు ప్రత్యూష, అలేఖ్య తెలిపారు. - మోపాల్

బయట కొనాల్సిందే...

● సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 110 - 120
■ రక్తపోటు, మధుమేహం మాత్రలు, కంటి మందులు, ఎలర్జీ ఆయింట్‌మెంట్స్, దగ్గు మందు కొరత ఉంది. ☛ మాత్రల కొరతతో రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు. రక్త పరీక్షలు కామారెడ్డిలోని టీ-హబ్‌కు పంపడంతో ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోంది. ➾ డ్రగ్స్ స్టోరు నుంచి మందులు సరఫరా చేయడంలో జాప్యం జరుగుతోందని వైద్యురాలు ఆస్మా తెలిపారు. - న్యూస్‌టుడే, సదాశివనగర్

విధులకు గైర్హాజరు



● సీహెచ్‌సీ, జుక్కల్ ◆ 110 పైనే ■ చర్మ సంబంధ వ్యాధుల మందులు లేవు ☛ ఔషధాల విభాగంలో మందులు ఇచ్చే వారు విధులకు గైర్హాజరవుతున్నారు. మందులైనా నర్సులే ఇస్తున్నారు. ➾ కొన్ని మందులు సరఫరా కావడం లేదని వైద్యాధికారి విఠల్ తెలిపారు. - జుక్కల్


ఇన్‌ఛార్జి వైద్యుడే ఆధారం

● హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 100 నుంచి 120
■ నొప్పుల బిళ్లలు, యాంటీ బయాటిక్స్ లేవు ☛ రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో ఇన్‌ఛార్జి వైద్యుడితో నెట్టుకొస్తున్నారు. స్టాఫ్‌నర్సు, ఇద్దరు ఏఎన్‌ఎంల అవసరం ఉంది.
➾ ప్రస్తుతం అన్ని మందులు ఉన్నాయని.. ఇన్‌ఛార్జి వైద్యుడితో సమావేశం, ఇతర సంతకాలు అవసరం ఉన్నప్పుడు రోగులకు సేవలు అందించలేకపోతున్నామని పీహెచ్‌సీ బాధ్యుడు సాయికుమార్ చెప్పారు - బాన్సువాడ

ఇక్కడ లెక్కే వేరు

● కోటగిరి సీహెచ్‌సీ ◆ 150
■ జ్వరానికి సంబంధించిన ఔషధాలు అవసరం..
☛ వైద్యురాలు సూచించిన దానికంటే తక్కువగా ఇచ్చి రిజిస్టర్‌లో ఎక్కువగా నమోదు చేస్తున్నారు. ఈ విషయమై ఓ రోగి కుమారుడు వైద్యురాలిని ప్రశ్నించగా.. చీటీలో ఉన్న మందుల సంఖ్య 8ని దిద్దుబాటు చేసి 4 రాసి చేతిలో పెట్టి పంపారు.
➾ ఆసుపత్రిలో జరిగిన విషయాన్ని ఉప వైద్యాధికారిణి సమత దృష్టికి తీసుకెళ్లగా మందుల కొరత లేదన్నారు. స్టాకు రావడంలో ఆలస్యం జరుగుతుందని చెప్పారు. రిజిస్టర్‌లో నమోదు విషయమై పరిశీలిస్తామని చెప్పారు.

\- కోటగిరి



కోటగిరి సీహెచ్‌సీ వైద్యురాలు రోగికి రాసిన మందులు

సరఫరా.. అరకొర

● రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ◆ 100
■ దగ్గు, జలుబు మందులు, చర్మ సంబంధ వ్యాధుల ఆయింట్‌మెంట్లు లేవు ☛ ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్సు బదిలీ కావడంతో ఒకరు డిప్యుటేషన్, ఇంకొకరు ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నారు.
➾ పెట్టిన ఇండెంట్‌లో 30 శాతం మందులు పంపుతున్నారని వైద్యురాలు ఆయేషా సిద్దిఖీ తెలిపారు.

\- న్యూస్‌టుడే, రుద్రూర్

జలుబు గుబులు

● దోమకొండ ◆ 400 ■ దగ్గు, జలుబు, రక్తపోటు మందులు లేవు. టీటీ ఇంజెక్షన్ల కొరత ఉంది. ☛ పిల్లలకు అవసరమైన జలుబు, దగ్గు, అలర్జీ మందులు లేకపోవడంతో ప్రైవేటులో కొనాల్సిన పరిస్థితి. ఫార్మసిస్టు రెండు నెలలుగా లేకపోవటంతో మందుల అవసరాన్ని గుర్తించే వారే కరవయ్యారు. ➾ మందులు అరకొరగానే వస్తున్నాయని.. అత్యవసరమైనవి ప్రత్యేక నిధుల నుంచి కొనుగోలు చేసుకొస్తున్నామని పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.



\- న్యూస్‌టుడే, దోమకొండ

కోతికాటు మందుల్లేవ్

● కల్లెడ ప్రాథమిక వైద్య కేంద్రం
◆ 100 ■ కోతికాటు, మధుమేహం మందుల కొరత ఉంది. ☛ పిచ్చి మొక్కలు పెరిగి, మురుగు నిలుస్తోంది ➾ రోగుల తాకిడి పెరిగింది. కానీ మందులు ఇంకా అవసరమని వైద్యాధికారి ప్రకాశ్ తెలిపారు.

\- న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం



వైద్యులు లేరు..

● బిచ్కుంద పీహెచ్‌సీ ◆ 100 - 150
■ చర్మ సంబంధ వ్యాధుల లేపనాలు, కన్ను, చెవికి సంబంధించిన మందులు అవసరం
☛ నిత్యం మధ్యాహ్నం వరకు మాత్రమే వైద్యులు ఉంటారు. ఆ తర్వాత స్టాఫ్‌నర్సులు చికిత్స చేస్తున్నారు.
➾ ఇద్దరు వైద్యులు ఇన్‌ఛార్జులు కావడంతో ఇబ్బందులు తలెత్తాయని పర్యవేక్షణ అధికారి కళాదాస్ చెప్పారు.



\- న్యూస్‌టుడే, బిచ్కుంద



ఎంపికైంది వీరే..

జాతీయస్థాయికి జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో జరిగే 42వ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

బాలికలు : సౌమ్యరాణి(పందిమడుగు), సాత్విక, శ్రావిక (పిప్రి), సన్నిత(పుప్పాలపల్లి), సోనీ(మంచిప్ప), వైశాలి(అక్లూర్)
బాలురు : అర్వింద్(బడా భీమ్‌గల్), లక్ష్వేందర్(ఆర్మూర్), అభినాష్(ఆర్మూర్)

యోగాసనాల్లో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ పటాన్‌చెరులో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన యోగాసన పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బాలుర విభాగంలో రెడ్డిపేట తండా ఉన్నత పాఠశాలకు చెందిన సందీప్, నవదీప్‌లు బంగారు పతకాలు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో నిఖిత(కేజీబీవీ మాచారెడ్డి)బంగారు పతకం, సహస్ర(కేజీబీవీ మాచారెడ్డి) రెండో స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. వీరితో పాటు జిల్లాకు చెందిన సునీత, కవిత, నిఖిత, సరస్వతి, సింధుజలు పతకాలు సాధించారని చెప్పారు. జూనియర్ బాలికల విభాగం నుంచి ఐశ్వర్య, అనిత, నిహారిక, కల్యాణిలు ప్రతిభ చాటారని వివరించారు.



పతకాలతో విద్యార్థులు

బాల్ బ్యాడ్మింటన్ విజేతలు రంగారెడ్డి, ఖమ్మం జట్లు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి ప్రథమ బహుమతి సాధించగా, ఆదిలాబాద్ ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ బహుమతి ఖమ్మం దక్కించుకోగా హైదరాబాద్ ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర కార్యదర్శి రమణ, ప్రతినిధులు లోయపల్లి నర్సింగరావు, మధు, శశి, చిన్నయ్య, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



బహుమతి అందుకుంటున్న రంగారెడ్డి జట్టు



కామారెడ్డిలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న విశారదన్ మహరాజ్

సమస్యల పరిష్కారానికి కృషి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ కార్యాలయాన్ని అధినేత విశారదన్ మహరాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా ఇన్‌ఛార్జిగా లక్ష్మణ్‌ను నియమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, కో కన్వీనర్ అరవింద్, సభ్యులు పరశురాములు, గంగరాజు, సాయి, సత్యం, లక్ష్మణ్, రాజశేఖర్, నితిన్, అనిల్, రాజు, రాంచంద్రం పాల్గొన్నారు.

44 మంది గైర్హాజరు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆదర్శ హిందీ విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు 44 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్, సమన్వయకర్త రవీందర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం పదో తరగతి సైన్సు అండ్ టెక్నాలజీ సబ్జెక్టుకి 112కి 88 మంది, ఇంటర్మీడియెట్ కామర్స్‌లో 71కి 56 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పదో తరగతి హిందీ సబ్జెక్టులో నలుగురికి ఇద్దరు, ఇంటర్మీడియెట్ భౌతికశాస్త్ర పరీక్షలో 46కి 43 మంది రాశారన్నారు.

ఒక్కరికే ఈవోగా పదోన్నతి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్‌లకు కార్యనిర్వహణాధికారులుగా శనివారం పదోన్నతులు ఇచ్చారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కేవలం ఒక్కరికే అవకాశం కల్పించారు. బోధన్ చక్రేశ్వరాలయంలో పని చేస్తున్న రాములును నిజామాబాద్ నగరంలోని లక్ష్మీనారాయణ ఆలయానికి ఈవోగా నియమించినట్లు సహాయ కమిషనర్ విజయరామారావు తెలిపారు. కనీసం ఐదుగురు ఈవోలు అవసరం ఉండగా ఒకే పోస్టును భర్తీ చేశారన్నారు. పూర్తిస్థాయిలో ఈవోలను భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరినట్లు పేర్కొన్నారు.

ఎల్లలు దాటిన బతుకమ్మ

● విదేశాల్లోనూ ఆడుతున్న ఇందూరు మహిళలు ●

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఎక్కడ ఉన్నా.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. పల్లె సంస్కృతికి పట్టాభిషేకం చేస్తున్నారు.. మనదైన బతుకమ్మను ఎల్లలు దాటినా సంబరంగా జరుపుకొంటున్నారు.. అక్కడ కూడా తీరొక్క పూలతో అమ్మవారిని పేర్చి పాటలు పాడుతూ ఆటలు ఆడుతున్నారు విదేశాల్లో ఉన్న మన ఇందూరువాసులు. ఉన్నత చదవులు, ఉద్యోగాల నిమిత్తం ఆయా దేశాల్లో స్థిరపడిన జిల్లా మహిళలు అక్కడా పూల పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.. ఈ నేపథ్యంలో 'ఈనాడు'తో తమ మనోగతాలు పంచుకున్నారు.



సంబురాల్లో పాల్గొన్న జిల్లా మహిళలు

సంతోషంగా ఉంది

\- ప్రణయ, డెన్వర్, అమెరికా



మాది నిజామాబాద్ జిల్లా వర్ని. బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆ సందడే వేరు. భారత్‌లో ఉంటే గునుగ పూలు ఉపయోగించేవాళ్లం. ఇక్కడ ఆ పూలు దొరకవు. అమ్మ పద్మ నుంచి పాటలు పాడటం నేర్చుకున్నా. పదేళ్ల క్రితం అమెరికా వచ్చాను. మా ఆయన అర్జున్, నేను ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులం. విధుల్లో ఎంత బిజీగా ఉన్నా సరే. . గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా బతుకమ్మ పండగను తప్పకుండా నిర్వహించుకుంటాం. బంతిపూలతో పాటు ఇక్కడ దొరికే గులాబీ తదితర పూలతో పేర్చి పూజిస్తున్నాం. ఈ సారి మా అమ్మ ఇక్కడికి వచ్చింది. ఆమెతో కలిసి పండగ చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. చిన్నప్పటి రోజులు గుర్తుకొస్తున్నాయి.

సురక్షితంగా వేడుకలు

\- కమ్మర్‌పల్లి వాసి పద్మజ, ఇజ్రాయెల్

అందరూ అనుకుంటున్నట్లు ఇజ్రాయెల్‌లో ఎలాంటి ఇబ్బందులు లేవు. ఉపాధి కోసం ఇక్కడికి వచ్చిన తెలంగాణ వాసులమంతా సురక్షితంగా ఉన్నాం. బతుకమ్మ వేడుకలను ఆనందంతో నిర్వహించుకుంటున్నాం. శ్యామల, రజిత, మౌనిక, నవ్య, లక్ష్మి, భూదేవి, అనితలతో కలిసి బతుకమ్మ ఆడుతున్నాను. తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రవి, కార్యదర్శి వివేక్, కోశాధికారి సాయికుమార్, ప్రేమ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సంబరాలను జరుపుకొంటున్నాం. స్థానికంగా దొరికే పూలతోనే బతుమ్మలను తయారు చేస్తున్నాం. ఏ దేశంలో ఉన్నా మన సంప్రదాయం మరవం.

కొరియర్‌లో పూలు తెప్పించాం

\- తేజస్విని, లండన్



నిజామాబాద్ జిల్లా కేంద్రం వినాయక్‌నగర్ అశోక్‌టవర్స్‌కు చెందిన మేము పదేళ్ల క్రితం ఉద్యోగరీత్యా లండన్ వచ్చాం. నాకు బతుకమ్మ పండగ ఎంతో ఇష్టం. ఇక్కడికి వచ్చినా అమ్మవారి పూజలకు అంతరాయం లేకుండా చూసుకుంటున్నా. ఇక్కడ తెలంగాణ వారితో కలిసి సంఘం ఏర్పాటు చేసుకున్నాం. బతుకమ్మ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నాం. గునుగ, తంగేడు, బంతి, చామంతి తదితర పూలను కొరియర్‌లో తెప్పిస్తున్నాం. ఈ సారి మా అత్తమ్మ నాగలక్ష్మి కూడా రావడంతో సందడి మరింత పెరిగింది. పిల్లలకూ నేర్పిస్తున్నా.

నూతన కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐతో పాటు బోధన్ మైనారిటీ, కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటీఐల్లో నూతన కోర్సుల్లో ప్రవేశానికి 5వ తేదీ నుంచి 9 వరకు అవకాశం కల్పిస్తున్నామని జిల్లా కన్వీనర్ యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్ల పైబడినవారు అర్హులని, పూర్తి సమాచారం కోసం https://iti.telangana.gov.in సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

బోర్గాం(పి)(మోపాల్) : ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్‌లో వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు సమావేశమై చేపట్టిన ర్యాలీని కమిషనర్ మకరందు, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, జనరల్ మేనేజర్ మునీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న మున్సిపల్ కమిషనర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ తదితరులు

ఉత్తమ సేవలకు పురస్కారం

నిజామాబాద్ అర్బన్ : బహుజన సాహిత్య అకాడమీ వారు ఉత్తమ సేవలు అందించిన వారికి తిరుపతిలో అవార్డులు ప్రదానం చేశారు. విద్యుత్తుశాఖలో డి-2 సెక్షన్ ఏఎల్ఎం సీనయ్య, డి-1 సెక్షన్ ఏఎల్ఎం సురేష్ కుమార్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వారిని విద్యుత్తుశాఖ ఏడీఈలు రాజశేఖర్, చంద్రశేఖర్ అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఉద్యోగులు

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: మారుతినగర్ రోడ్‌నం-5లోని పార్కు సమీపంలో మరుగు కాలువ పూడిక తీసి రోడ్డుపై వేశారు. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. కనీసం రోడ్లు సైతం శుభ్రం చేయడం లేదు. **- రాజారెడ్డి, మారుతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు**

పరిష్కారం : పూడికను వెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేసేందుకు కార్మికులను పంపిస్తాం. **- షాదుల్లా, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: దుబ్బ రోడ్డులో పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- సత్యనారాయణ, దుబ్బ**

పరిష్కారం: పశువులను వదిలిన యజమానులకు జరిమానాలు విధిస్తాం.
- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: వినాయక్‌నగర్ తినేత్రకాలనీలో స్తంభానికి వీధి లైట్లు పగిలిపోయాయి.
- గోదావరి, కాలనీవాసి

సమాధానం: సిబ్బందిని పంపించి సమస్య పరిష్కారించేలా చూస్తాం. **- ఇనాయత్, ఏఈ, బల్దియా, నిజామాబాద్**

– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం, నిజామాబాద్ అర్బన్

చెరువులో వ్యర్థాలు

నీటి దుర్వాసనతో స్థానికులకు ఇబ్బందులు

– న్యూస్‌టుడే, మోపాల్

మాధవనగర్ చెరువు, బోర్గాం(పి) వాగులో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్ ఇతర సామగ్రి వీటిల్లో పారేయడంతో అవి కుళ్లిపోయి ప్రస్తుతం పరిసరా ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న సమయంలో నీటి నుంచి దుర్వాసన రావడంతో అనారోగ్యానికి గురవుతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వీటిల్లోని నీటిని పశువులు తాగి అస్వస్థతకు గురయ్యే అవకాశాలున్నాయని రైతులు వాపోతున్నారు. చేపలు కాలుష్యంతో మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చెరువు, వాగులోని వ్యర్థాలు తొలగించాలని కోరుతున్నారు.



మాధవనగర్ చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

చర్యలు తీసుకుంటాం

- సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్

నీళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బందితో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. నీరు కలుషితం కాకుండా చూస్తాం.



రుద్రూర్‌లో కుంకుమార్చన..



నగరంలోని గౌతంనగర్‌లో..



దుబ్బాకలో..

కరుణ చూపుమా కనకదుర్గమ్మా

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మలగన్న అమ్మ..మాపై నీ కరుణ చూపుమా కనకదుర్గమ్మ అంటూ భక్తులు వేడుకున్నారు. ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చింది. సామూహికంగా పారాయణాలతో భక్తులు పూజించారు. నగరంలోని ఆలయాలు, మండపాల్లో కొలువైన దుర్గాదేవిమాతను ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు.



కల్దుర్కిలో..



మంచిప్పలో..



కిషన్‌గంజ్ వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి 15 కిలోల వెండి ఆభరణాలతో అలంకరణ



పాటి గల్లీలో..



సుద్దపల్లిలో బోనాల ఊరేగింపు..



వర్ని : జలాల్‌పూర్‌లో..



బోధన్ : నల్ల పోచమ్మ ఆలయం వద్ద రంగోలి పోటీలు..

డీఎస్పీ కార్యాలయం ప్రారంభం



రిబ్బన్ కత్తిరిస్తున్న విశారదన్ మహరాజ్

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) కార్యాలయాన్ని పార్టీ అధినేత విశారదన్ మహరాజ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం తమ పార్టీ యుద్ధం చేస్తోందన్నారు. స్థానిక సంస్థల సమరంలో ప్రాతినిధ్యం పెరగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి సుమన్, జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ప్రేమ్, రాజేశ్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మల్లారం గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. గ్రామంలోని పేదలను గుర్తించి సంఘం తరపున బియ్యం, పప్పు, నూనె, పిండి, చక్కెర తదితర నిత్యావసరాలు అందించినట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు భాస్కర్, శ్రీనివాస్, భూమయ్య, రాజేశ్వర్, ప్రశాంత్ తదితరులున్నారు.

నేడు నీటి సరఫరా బంద్

బోధన్, న్యూస్‌టుడే : బోధన్ పట్టణంలో సోమవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా కమిషనర్ వెంకట్‌నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్ బెడ్ శుభ్రం, మోటారు మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నగరంలోని గంగస్థాన్ ఫేస్-2 రెసిడెన్షియల్ సంక్షేమ సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకొంది. అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా శ్యాం, కోశాధికారిగా రమేష్, ఉపాధ్యక్షులుగా సాయిప్రసాద్, అశోక్‌రెడ్డి, గురుదాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శైలేష్, గంగాధర్, సంయుక్తకార్యదర్శులుగా నర్సింలు, బనావత్ లచ్చిరాంనాయక్, సురేష్, శ్రీనివాస్, రాజు, వెంకట్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

భూమిపూజ

చందూర్, న్యూస్‌టుడే: మోస్రాలో వ్యవసాయ సహకార సంఘ భవనం శిథిలావస్థకి చేరడంతో నూతన భవన నిర్మాణానికి ఆదివారం సొసైటీ ఛైర్మన్ జగన్మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. సంఘ కార్యాలయ భవనం, గోడౌన్ నిర్మాణం కోసం రూ.37లక్షల వ్యయంతో 75శాతం సహకార బ్యాంక్, 25శాతం సొసైటీ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం పార్టీ నాయకులు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశారు. భారాస యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అభిలాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేటలోని దర్యాపూర్ మహాలక్ష్మి ఆలయం, దుర్గామాత మండపంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ఆదివారం పూజలు చేశారు. మహాలక్ష్మి ఆలయాభివృద్ధికి తన వంతుగా రూ.1,00,116 విరాళం ప్రకటించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. తెడ్డు పోశెట్టి, రాజేంద్రకుమార్‌గౌడ్, దేవరాజ్, పోతన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంచిప్ప వీడీసీ కార్యవర్గం ఎన్నిక

మంచిప్ప(మోపాల్), న్యూస్‌టుడే: మంచిప్ప గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకట్రాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ నియమితులయ్యారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని నూతన సభ్యులు పేర్కొన్నారు.

డీజేను అనుమతించాలి



వినతిపత్రం అందిస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ నేరవిభాగం: దసరా, బతుకమ్మ పండగలకు డీజే అనుమతించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం సీపీ కల్మేశ్వర్ శింగెనవార్‌కు వినతిపత్రం అందించారు. డీజేలు అనుమతించడం లేదని, జిల్లాలో రాత్రి పది గంటల వరకే హోటళ్లు తెరచి ఉంచాలనే నిబంధనలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనతో సీపీ సానుకూలంగా స్పందించారని మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఖుద్దుస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావానికి చిరునామా బాన్సువాడ : పోచారం

కోటగిరి, న్యూస్‌టుడే: బాన్సువాడ నియోజకవర్గం భక్తిభావానికి మారుపేరని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోటగిరిలో నిర్మించిన అయ్యప్ప స్వామి, సాయిబాబా మందిరాల ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన, గోడ ప్రతులను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఆలయాల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. నవంబర్ 14 నుంచి 18వరకు ఆలయం వద్ద పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కోటగిరి మండలం నలుమూలల నుంచే కాకుండా ఇతర మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, స్థపతి మోతీలాల్, వెంకటేశ్వర శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు విఠల్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన ప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

సభ్యత్వ నమోదుకు చక్కటి స్పందన

డిచ్‌పల్లి, బోధన్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కుమార్‌కులాచారి అన్నారు. డిచ్‌పల్లిలో ఆదివారం ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ఇప్పటివరకు జిల్లాలో 60 వేలకు పైగా.. గ్రామీణ నియోజకవర్గంలో 15 వేలకు పైగా సభ్యత్వాలు చేయించినట్లు వివరించారు. మాజీ ఎంపీపీ భూమన్న, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, నాయకులు సురేశ్ కులాచారి, సతీశ్ పాల్గొన్నారు. బోధన్ తట్టికోట ప్రాంతంలోనూ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, పుర ఫ్లోర్‌లీడర్ వినోద్, గోపికిషన్ పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న దినేశ్‌కుమార్

రామ.. రామ.. రామ ఉయ్యాలో..

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమ్మా బతుకమ్మ.. బంగారు బతుకివ్వవే అంటూ పూజించారు. తీరొక్క పూలతో పేర్చి అమ్మవారి మహిమలను గుర్తుచేసుకుంటూ పాటలు పాడారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం అట్లబతుకమ్మగా అమ్మవారిని అలంకరించి వేడుకున్నారు.



రెంజల్ : దూపల్లిలో..



గంగాస్థాన్ ఫేస్-2 అశోక ఎవెన్యూలో..



ఐద్వా ఆధ్వర్యంలో జిల్లాకేంద్రం అంబేడ్కర్ కాలనీలో..

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

వర్ని, న్యూస్‌టుడే : జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండలం జాకోరాకు చెందిన సాయిలు (40) కొన్ని ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడేవారు. దీనికి తోడు పక్షవాతానికి గురయ్యారు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దవాఖానాకు తరలిస్తుండగా మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అప్పుల బాధ భరించలేక..

వర్ని, న్యూస్‌టుడే: అప్పుల బాధలు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ కథనం ప్రకారం.. మోస్రాకు చెందిన ఎస్.సాయిలు (46) అనే వ్యక్తి అప్పులు చేశారు. అలాగే పెళ్లీడుకొచ్చిన కూతురు ఉండటంతో మనస్తాపానికి గురయ్యారు. కూతురికి పెళ్లి చేయలేక మానసికంగా బాధపడుతూ శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్ద సాయిలు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు విచారణ చేసి మృతదేహాన్ని బోధన్ దవాఖానాకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో దూకి మహిళ..

ధర్పల్లి, న్యూస్‌టుడే: చెవులు వినిపించడం లేదని మానసికంగా కుంగిపోయి ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ధర్పల్లి మండలం హోన్నాజీపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి నర్సవ్వ (40)కు గత కొంతకాలం నుంచి చెవులు వినిపించడం లేదు. దీంతో ఆమె మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో శనివారం ఉదయం గ్రామంలోని హోన్న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం మృతదేహం లభ్యమైందని, మృతురాలి సోదరుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

కాలువలో పడి మృతి


నిజామాబాద్ నేరవిభాగం : ఆరో ఠాణా పరిధిలోని నిజాంసాగర్ కాలువలో పడి ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని ధర్మపురిహిల్స్‌లో నివాసం ఉంటున్న అక్బర్‌ఖాన్(38) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవారు. ఆదివారం నిజాంసాగర్ కాలువ వద్ద కూర్చోగా ప్రమాదవశాత్తు జారి కాలువలో పడిపోయాడు. చుట్టపక్కల వారు చూసేలోపు కొట్టుకుపోయారు. పోలీసులకు సమాచారం అందించగా గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మొగులయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో..

జక్రాన్‌పల్లి : రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన పండిత్ గోరి(28) మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని బోకర్ జిల్లా రేనాపూర్ గ్రామానికి చెందిన పండిత్ గోరి బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై తన స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో 44వ నంబరు జాతీయ రహదారిపై అర్గుల్ శివారులో విభాగినిని ఢీకొని కిందపడగా.. వెనుకనుంచి వచ్చిన వాహనాలు ఆయనపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో సర్వేయర్..

ఇందల్‌వాయి : ఇందల్‌వాయి మండల సర్వేయర్ కె.మోహన్(54) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌కు చెందిన మోహన్ ఏడాది కిందట ఇందల్‌వాయికి బదిలీపై వచ్చారు. హైదరాబాద్‌లో బంధువు మృతిచెందగా శనివారం వెళ్లారు. అంత్యక్రియలు ఆదివారం చేస్తారని తెలియడంతో అక్కడే సోదరుడి ఇంట్లో నిద్రించారు. రాత్రి సమయంలో ఫిట్స్, గుండెపోటు రావడంతో మృతిచెందారు. మృతదేహాన్ని ఆదివారం జిల్లా కేంద్రానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు. మోహన్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.



కె.మోహన్

3 కిలోల గంజాయి పట్టివేత

కరీంనగర్ నేరవార్తలు: కరీంనగర్‌లో మూడో ఠాణా పోలీసులు రూ.70 వేల విలువైన 3 కిలోల గంజాయిని పట్టుకున్నారు. సీఐ జాన్‌రెడ్డి కథనం ప్రకారం.. నిజామాబాద్ మాలపల్లికి చెందిన ఉస్మాన్‌ఖాన్ శనివారం వ్యవసాయ మార్కెట్ సమీపంలో ద్విచక్రవాహనంపై సంచితో అనుమానాస్పదంగా కనిపించడంతో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. సరకు కొనుగోలుకు వచ్చిన సలీంఖాన్ పరారీలో ఉన్నాడు.

బెట్టింగ్ యాప్‌లో రూ.1.51 లక్షలు మాయం

నిజామాబాద్ గ్రామీణం: మల్లారానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఓ గేమింగ్ యాప్‌లో డబ్బులు పెడితే రెట్టింపు అవుతాయని ఆన్‌లైన్‌లో చూసి శనివారం రూ.1,51 లక్షలు పెట్టారు. ఖాతాలో డబ్బులు రెట్టింపు కాకపోగా.. పెట్టిన నగదు పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం కేసు నమోదు చేసి సంబంధిత ఖాతాను ఫ్రీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరీఫ్ తెలిపారు.

మహిళా వ్యాపారులపై ఆటో డ్రైవర్ దాడి

బోధన్ గ్రామీణం : బోధన్ అంగడిలో మహిళా కూరగాయల వ్యాపారులపై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. దీంతో ఇద్దరు మహిళా వ్యాపారులు గాయపడ్డారు. ఆదివారం వారపు అంగడి కావడంతో ఓ మహిళ ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణం ఎదుట ఓ వ్యక్తి ఆటో నిలిపాడు. తమ గిరాకీ దెబ్బతింటుందని, వాహనాన్ని తొలగించాలని ఆ మహిళలు డ్రైవర్‌ను కోరారు. ఈ విషయంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ మహిళలపై దాడి చేయడంతో వారు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని నియంత్రించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ట్రాక్టర్ పట్టివేత

సిరికొండ : ఒంటిప్పతండా శివారులోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. వాహనాన్ని ఠాణాకు తరలించామని, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

వెండి నగల కోసం మహిళ హత్య

మద్యం తాగించి బ్లేడుతో గొంతుకోసిన వైనం

మూసాపేట, న్యూస్‌టుడే: రూ.10 వేల విలువ చేయని వెండి వస్తువుల కోసం ఓ మహిళను చంపి.. బ్లేడుతో శరీరంపై గాట్లు పెట్టి హత్యాచారంగా చిత్రీకరించేందుకు మరో మహిళ విఫలయత్నం చేసింది. ఈ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 2న మృతదేహం వెలుగుచూడగా.. సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తు, ఏసీపీ శ్రీనివాసరావు, బాలానగర్ అదనపు డీసీపీ సత్యనారాయణతో కలిసి డీసీపీ కె.సురేష్‌కుమార్ ఆదివారం వివరాలు వెల్లడించారు. ఎడపల్లి మండలానికి చెందిన ధర్మారం ప్రియాంక(23) భర్తతో విడిపోయి రెండు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ కింద తలదాచుకుంటోంది. చెడు వ్యసనాలకు బానిసైన ఆమెకు ఎల్లమ్మబండ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కటారి మంజుల(35)తో పరిచయం ఏర్పడింది. ప్రియాంక తన వెండి గొలుసులు, మెట్టెలు మంజులకు ఇచ్చి దాచాలని కోరింది. కొన్నాళ్ల తర్వాత అడిగితే నిరాకరించడంతో ప్రియాంక మరో ముగ్గురితో మంజుల ఇంటికెళ్లి నిలదీసి నగలు తెచ్చుకుంది. అవమానంగా భావించిన ఆమె ఎలాగైనా ప్రియాంకను చంపాలని నిర్ణయించుకుంది. సెప్టెంబరు 30న మద్యం తాగేందుకు ఇంటికి ఆహ్వానించి ఆమె స్పృహ తప్పేలా చేసింది. రాత్రి స్కూటీపై కేపీహెచ్‌బీకాలనీలో ఉదాసీన్ మఠానికి చెందిన నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బ్లేడుతో గొంతు కోసి హత్య చేసి నగలు తీసుకెళ్లింది. హత్యాచారంగా చిత్రీకరించేందుకు ప్రియాంక లోదుస్తులు చింపేసి.. మర్మాంగం, గొంతు నుంచి ఛాతి వరకు గాట్లు పెట్టింది.



ప్రియాంక

పట్టించిన సీసీ కెమెరాలు

పోలీసులు హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించగా.. హత్యకు ముందు వీరు ఇద్దరు స్కూటీపై వెళ్తున్నట్లు గుర్తించారు. కొద్దిసేపటి తర్వాత ఒక్కరే కనిపించారు. వాహనం నంబరు ఆధారంగా మంజులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించింది.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటికి వచ్చే బండిలో వేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు కోరారు. ఆదివారం డంపింగ్ యార్డులోని కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వ్యర్థాలను మురుగుకాల్వల్లో వేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ బదులు వస్త్ర సంచులు వినియోగించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ప్రభుదాస్ తదితరులు ఉన్నారు.

నిజాం సుగర్స్‌పై నిర్ణయానికి డిమాండ్

బోధన్ : నిజాం సుగర్స్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండు చేశారు. బోధన్‌లో ఏరియా రెండో మహాసభపై సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా పరిశ్రమపై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదన్నారు. కార్మికులకు లేఆఫ్ కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లించాలన్నారు. 19న నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో శంకర్ గౌడ్, గంగాధరప్ప, పాల్గొన్నారు.

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ

ఉత్తమ సేవలకు అవార్డు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: బహుజన సాహిత్య అకాడమీ వారు ఉత్తమ సేవలు అందించిన వారికి తిరుపతిలో అవార్డులను ప్రదానం చేసింది. విద్యుత్తు శాఖలో డి-2 సెక్షన్ ఏఎల్ఎం సీనయ్య, డి-1 సెక్షన్ ఏఎల్ఎం సురేష్ కుమార్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వారిని విద్యుత్తు శాఖ ఏడీఈలు తోట రాజశేఖర్, చంద్రశేఖర్, ఏఈలు సుమిత, నగేష్ అభినందించారు.


అవార్డు అందుకుంటున్న విద్యుత్తు ఉద్యోగులు

కాలనీవాసుల శ్రమదానం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లోని జర్నలిస్టు కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ..సమైక్య కాలనీ నిర్వహించారు. వీధి నెంబర్ 1లో పరిసరాలు పరిశుభ్రం చేశారు. మురుగు కాలువల్లో పేరుకున్న వ్యర్థాలు తొలగించారు. గత 65 వారాలుగా ప్రతి ఆదివారం రెండు గంటలు శ్రమదానం చేస్తున్నట్లు కాలనీవాసులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, భూమన్న, భూమయ్య, రాజు, రవి, గణేశ్, రాజ్‌కుమార్, సాయన్న, ఖదీర్, మోహన్, శంకర్, కుమార్ పాల్గొన్నారు.



కుంకుమార్చనలు...ప్రత్యేక అలంకరణ

ఆర్మూర్ పట్టణం, కమ్మర్‌పల్లి, బాల్కొండ, న్యూస్‌టుడే: ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దుర్గామాత మండపాల్లో ఆదివారం అన్నపూర్ణమాతగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆర్మూర్‌లోని హౌసింగ్ బోర్డులో కూరగాయలతో అలంకరించారు. మామిడిపల్లిలో అమ్మవారికి 54 రకాల నైవేద్యాలు సమర్పించారు.


ఉప్పూర్‌లో..


హౌసింగ్ బోర్డు ఆలయంలో కూరగాయలతో అలంకరణ


కిసాన్‌నగర్‌లో లలిత త్రిపుర సుందరీదేవిగా..


హసాకొత్తూర్‌లో...


మహాలక్ష్మి కాలనీలో


ఆర్మూర్: మహాలక్ష్మి కాలనీలో కుంకుమార్చన


బాల్కొండలో పూజలు నిర్వహించిన భక్తులు


మామిడిపల్లిలో 54 రకాల ప్రసాదాలు

చెట్టే కదా అని కొట్టేస్తే.. కుదరదు

మొక్కే కదాని పీకేస్తారేమో కుదరదు.. చెట్టుగా ఎదిగిన తర్వాత కొట్టేస్తామంటే సర్కారు ఊరుకోదు. ఎంతో వ్యయప్రయాసలు ఓర్చి ప్రభుత్వం వనమహోత్సవం పేరిట మొక్కలు నాటిస్తోంది. ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం చేసింది.. లక్ష్యాలు నిర్దేశించింది. గత పదేళ్లుగా చేపట్టిన ఈ యజ్ఞం ఇప్పుడు కొమ్మలేసి, నీడ నిచ్చే స్థాయికి వచ్చింది. అయితే వాటిని ఎవరైనా నరికితే ప్రయత్నం చేస్తే యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుంది. అవగాహన రాహిత్యంతో తన భూమిలోని చెట్టే తీసేద్దామనో, రోడ్డు దాటేందుకు అడ్డంగా వస్తున్నాయని భావించి తొలగిస్తే చర్యలు తీసుకునేందుకు అటవీశాఖ వెనుకాడడం లేదు. చెట్ల విషయంలో జాగ్రత్త అని అధికారులు చెబుతున్నారు. — న్యూస్‌టుడే, ఆర్మూర్

☛ జోలికి వెళ్తే తప్పదు జరిమానా
☛ అటవీ శాఖ నిశిత నిఘా

ఇటీవల భీమ్‌గల్ మండలం పురాణీపేట్‌లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 11 వృక్షాలను నరికించారు. దీనిపై గ్రామస్థులు కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ అధికారులకు ఫిర్యాదుచేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి విచారణ చేపడితే స్థానిక కాలనీవాసులు అడ్డుగా ఉన్నాయని ఫిర్యాదుచేయడంతో తొలగించినట్లు కార్యదర్శి వివరణ ఇచ్చారు. అయినా లింబాద్రి, మాధవిలకు రూ.12,100, గంగయ్య, శోభలకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.



నెల రోజుల కిందట ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో 38 చెట్లు నరికేయించారు. ఈ విషయం 'ఈనాడు'లో ప్రచురితం కావడంతో స్పందించిన ఆర్మూర్ డిప్యూటీ రేంజ్ అటవీ శాఖ అధికారి శ్రీదేవి విచారణ చేపట్టారు. ఇందుకు కళాశాల ప్రధాన అధ్యాపకులను బాధ్యులుగా పేర్కొంటూ రూ. 49,856 జరిమానా విధించారు.

మనుషులు, జీవాలకు ప్రాణవాయువు కావాలంటే చెట్లే ఆధారం. అలాంటి వాటిని కొందరు ఎక్కడికక్కడ నరికేస్తున్నారు. వ్యవసాయ పంటపొలాలను చదును చేసే క్రమంలో ఇష్టారాజ్యంగా తొలగించేస్తున్నారు. గీత కార్మికులకు ఉపాధి కల్పించే తాటి, ఈత వనాలను కొట్టేస్తున్నారు. రోడ్డు వెంబడి నాటిన హరితహారం చెట్లను కొందరు నరికేస్తున్నారు. ఇంకొందరు కాల్చేస్తున్నారు. రిజర్వు ఫారెస్టు భూముల్లోనూ వంట చెరుకు పేరుతో టేకు, ఇతరత్రా వనాలు నరికేస్తున్నారు. ఇప్పుడు అటవీశాఖ క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పర్యవేక్షణ పకడ్బందీగా మారింది. ఏ చిన్నపాటి ఫిర్యాదు వచ్చినా స్పందించేందుకు ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. అందుకే ఏ చెట్టు జోలికి పోవాలన్నా జర జాగ్రత్త..! అని హెచ్చరిస్తున్నారు.

3 రేంజ్‌లు.. 7 సెక్షన్లు

ఆర్మూర్ అటవీ డివిజన్ పరిధిలో 33,605.30 హెక్టార్ల విస్తీర్ణంలో అడవులున్నాయి. కమ్మర్‌పల్లి, సిరికొండ, ఆర్మూర్ రేంజ్‌లతో పాటు నందిపేట్, మామిడిపల్లి, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, మెండోరా, బాల్కొండ, వేల్పూర్ పరిధిలో సెక్షన్లు ఉన్నాయి. తెలంగాణ హరితహారం పథకం కింద అటవీశాఖతో పాటు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు ఉపాధిహామీ పథకం ద్వారా కోట్లలో మొక్కలు నాటారు. జాతీయ రహదారి-44, 63 వెంబడి సుమారు 60 కిలోమీటర్ల మేర ప్లాంటేషన్ ఉంది. ఇదంతా పర్యావరణానికి ఎంతగానో దోహదపడుతోంది.

అవగాహన ఉంటే ఇబ్బంది లేదు

చెట్లు నరికితే చర్యలుంటాయనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలి. రిజర్వు ఫారెస్ట్ ఏరియాలో నిషేధాజ్ఞలుంటాయి. ఇక బయట ప్రాంతాల్లో రోడ్ల వెంబడి, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఎక్కడైనా ఇబ్బందిగా ఉందని గుర్తిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. దాన్నీ క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఒక్కో చెట్టుకు రూ. 500 చలానా వేసి తొలగించేందుకు అనుమతి ఇస్తాం. ఇలా పెట్రోల్ బంకులు, పాఠశాలల వారు సంప్రదిస్తున్నారు. మూడురోజుల్లోగా ప్రక్రియ పూర్తి చేస్తాం. ఈ విషయంపై అవగాహన లేక తొలగించే అధికారం చేతుల్లోకి తీసుకుంటే జరిమానాలకు బాధ్యులవుతారు. అలాగే పట్టాభూముల్లోనూ టేకు చెట్ల విషయంలో తహసీల్దార్ ధ్రువీకరణతో దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులకు నివేదించి అటవీశాఖ పరిమితులకు లోబడి అనుమతి ఇస్తాం.

శ్రీదేవి, డిప్యూటీ రేంజ్ అటవీశాఖ అధికారిణి, ఆర్మూర్

ఆత్మహత్య.. **ఇబ్రహీంపట్నం:** జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని సత్తక్కపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కి చెందిన కందేశ్ ప్రవీణ్(40).. మోర్తాడ్ నుంచి బస్సులో వచ్చి సత్తక్కపల్లి గ్రామశివారులో దిగాడు. వరద కాలువ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో ఒకరి మృతి.. **జక్రాన్‌పల్లి:** రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన పండిత్ గోరి(28) మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని బోకర్ జిల్లా రేనాపూర్ గ్రామానికి చెందిన పండిత్ గోరి బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై తన స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో 44వ నంబరు జాతీయ రహదారిపై అర్గుల్ గ్రామశివారులో విభాగినిని ఢీకొని కిందపడగా.. వెనుకనుంచి వచ్చిన వాహనాలు ఆయనపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
94939 26837
98666 11160

ఏర్గట్ల: డీ-19 డిస్ట్రిబ్యూటరీ కాలువలో తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్ శివారులో నా పొలం దగ్గర మొత్తం చెత్త, ముళ్ల పొదలు ఉండడంతో ప్రవాహం ఆగిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. - **దేవానంద్ గౌడ్, తాళ్లరాంపూర్**

సమాధానం: త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. **అలీమ్, లస్కర్**

వాహనం వచ్చింది



ఆర్మూర్ పట్టణం: మామిడిపల్లిలో చెత్త సేకరణకు సక్రమంగా రావడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. బల్దియా అధికారులు స్పందించారు. ఆదివారం కాలనీకి చెత్త సేకరించే వాహనాన్ని పంపించారు.

చెత్త తొలగింపు

భీమ్‌గల్: బడాభీమ్‌గల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఖాళీ ప్రదేశంలో చెత్త వేస్తున్నారని 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా స్థానిక కార్యదర్శి రజిత దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె చెత్తను తొలగింపజేశారు.

స్వయం సేవకుల పద సంచాలన్

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అంకాపూర్ భార్గవి విద్యానికేతన్‌లో ప్రాథమిక శిక్షావర్గ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శిక్షణ శిబిరం గత వారం రోజులుగా కొనసాగుతోంది. ఆదివారం స్వయం సేవకులు గ్రామ వీధులలో పద సంచాలన్ నిర్వహించారు. నగర సంఘ చాలక్ నారాయణ, నగర కార్యవాహ రాజ్‌కుమార్, సహ కార్యవాహ బాలానంద్, వ్యవస్థా ప్రముఖ్ దయాసాగర్, స్వయం సేవకులు పాల్గొన్నారు.



మెకానిక్‌ల సంఘటితానికి సర్వే

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: మెకానిక్‌ల ఐక్యత కోసం మండలాల వారీగా సర్వే చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ అండ్ ఇంజినీరింగ్ మోటార్ రివైండింగ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిస్వామి అన్నారు. కమ్మర్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమానికి ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. అధ్యక్షుడు జాగర్ల నవీన్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి దయాకర్, కోశాధికారి సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.


గిరిస్వామిని సన్మానిస్తున్న కమ్మర్‌పల్లి ఎలక్ట్రికల్ మెకానిక్‌లు

సంఘం అభివృద్ధికి కృషి

ఆర్మూర్ పట్టణం: ప్రతి ఒక్కరూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు చక్రవర్తి అన్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాంనగర్ సంఘ భవనంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గోవిందరాజస్వామి, రవికాంత్, శరత్, భాస్కర్, ప్రకాశ్, నందు, స్వామి, సింహయ్య, నరేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సంఘం సభ్యులు

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గీత కార్మికులకు సేఫ్టీ మోకుల ఉపయోగంపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు పేర్కొన్నారు. పట్టణంలోని పెర్కిట్‌లో ఆదివారం కార్మికులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడు కేంద్రాల్లో ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం కార్మికులకు వాహనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ ఈడీ రమేష్, ఎక్సైజ్ అధికారులు నర్సయ్య, గంగాధర్‌లు కార్మికులకు సేఫ్టీ మోకులు అందజేశారు. శిక్షకులు బుచ్చాగౌడ్, అనిల్‌గౌడ్, జితేందర్ గౌడ్, సదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికుడికి శిక్షణ ఇస్తున్న శిక్షకులు

ఏర్గట్లలో నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఏర్గట్ల, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 సంవత్సరంలో జరిగిన పనులపై 'సామాజిక తనిఖీ ప్రజావేదిక' సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏపీవో వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. క్షేత్ర సహాయకులు, టీఏలు సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాత, ప్రముఖ వ్యాపారవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి విద్యార్థుల కోసం రూ. 65 వేల విలువైన 20 డెస్క్ బెంచీలను ఆదివారం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి, ఉపాధ్యాయులు అశోక్, గంగాధర్, వినోద్, రవి, ఎం.గంగాధర్, సాయన్న, చంద్రకళ పాల్గొన్నారు.



అవీ...ఇవీ.. అన్నీ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్‌లోని బోయిగల్లికి చెందిన చిన్నయ్య, లక్ష్మి దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న భారతీ విద్యాలయం 2001-2002 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.7,500ల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సుమన్, సురేష్, హరీఫ్, నర్సింగ్‌రావు, బండి శ్రీనివాస్, సుమలత, స్వరూప, నీరజ, సునిత, గంగాస్వామి, రాము, మహేష్ తదితరులున్నారు.

పరామర్శ

భీమ్‌గల్, భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: రహత్‌నగర్ గ్రామానికి చెందిన బోండ్ల సురేందర్, గంగాధర్, సుదర్శన్‌నగర్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు సురేష్ తండ్రి సీతారం, జాగిర్యాల్ గ్రామానికి చెందిన గంగుబాయి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి, సేవాలాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళులు

ఆర్మూర్ పట్టణం: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్మూర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత, నాయకులు సత్యం, సంతోష్, రాజన్న, ఎల్లయ్య, రాజారాం, వెంకటి, సాయినాథ్, నరేశ్, బాజన్న, సాయిలు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఊరేగింపు

భీమ్‌గల్ గ్రామీణం: దేవి శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా ఆదివారం జాగిర్యాల్ గ్రామంలో బోనాలు ఊరేగించారు. అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి సమర్పించారు.



ఉత్సాహంగా శాకాహార ర్యాలీ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ, పట్టణంలోని మామిడిపల్లి ధ్యాన బంధువులు వీడీసీ సహకారంతో ఆదివారం పట్టణంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ గురువు మిట్ట మనోహర్, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది సాయి కృష్ణారెడ్డి, సిద్ధేశ్వర పిరమిడ్ ఛైర్మన్ గంగారాం, గంగారెడ్డి, దయానంద్, లక్ష్మారెడ్డి, మాల్యాద్రి, చిన్నయ్య, రాజుగౌడ్, శ్రీనివాస్, ప్రేంకుమార్ పాల్గొన్నారు



సాగు క్షేత్రం నుంచి ఇళ్లకు..

సోయాబీన్ పంట చేతి కొచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో నూర్పిడి చేసిన రైతులు పంటను తక్కువ ధరకు విక్రయించలేక ఇళ్లకు తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. మద్దతు ధర రూ.4892 ఉంటే వ్యాపారులు రూ.4300 మాత్రమే చెల్లిస్తున్నారు. క్వింటాకు రూ.592 నష్టపోవాల్సి రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో బద్దం హరీశ్ అనే యువ రైతు 40 క్వింటాళ్ల సోయాను బస్తాల్లో నింపి ఇంట్లో నిల్వ చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కోసం వారం రోజులుగా నిరీక్షిస్తున్నారు.

–న్యూస్‌టుడే, హాసాకొత్తూర్(కమ్మర్‌పల్లి)

